కథ

**జీవితంలో ఒక స్టేజికి వచ్చిన తర్వాత, అప్పటివరకు నడిచిన మార్గాన్ని ఓసారి వెనక్కి తిరిగి చూసుకుని విశ్లేషించుకుంటే కనీసం ఒక్క సంఘటన గురించయినా 'అప్పట్లో అలా చేసి ఉండాల్సింది కాదు' అని అనుకోగలగాలి. అలా అనుకోలేదంటే, ఆ మనిషి వ్యక్తిత్వంలో ఎలాంటి ఎదుగుదలా లేదన్నమాట.**

# తమసోమా జ్యోతిర్గమయ

★ ★ ★

వాడు నా స్నేహితుడు, మేమిద్దరమూ ఓ చిన్న పల్లెటూళ్లో ఒకేసారి పుట్టాం. కానీ నాకై నేను స్వతంత్రంగా ఆలోచించగలిగే శక్తి వచ్చేవరకూ వాడెవరో, ఎలా ఉంటాడో కూడా తెలిసింది కాదు.

అప్పటికి పల్లెలకి కరెంటు రాలేదు. పూరిపాకలు, సాయంకాలమైతే ఆకాశంలో పరుచుకునే గోధూళి, అప్పుడప్పుడు ప్రదర్శించే తోలుబొమ్మలాటలు, శ్రీరామనవమి వసంతాలు, దసరా ఊరేగింపులు, ఆగస్టు పదిహేనున కనిపించే జాతీయతా భావం...

అప్పట్లో-వాడు సాయంత్రం ఆరుగంటలకల్లా భోజనాలు ముగించి హరికెన్ లాంతరు వెలుగులో చదువుకునేవాడు. వాడు చదవడం మొదలుపెడితే- అది రామాయణ కావ్యమైనా, స్వారోచిష మనుసంభవమైనా చివరికి తరగతి పుస్తకమైనా సరే- ఎగిరే పక్షిసైతం ఆగి వినేది. పాలకోసం అరిచే లేగదూడ ఆకలి మరచి ఆదమరిచి వినేది.

ఆ నిశ్శబ్దంలో... ఆ నిశీధిలో..ఒక్కో శ్లోకాన్నీ వాడు రాగయుక్తంగా, భావగర్భితంగా చదువుతుంటే విన్న ప్రకృతికాంత పులకించి పోయేది.

క్లాసులో ఫస్టుమార్కు వాడిదే. ఆటల్లో బెస్టు కూడా వాడే. వాణ్ణి చూస్తే నాకు ముచ్చటేసేది. పద్నాలుగేళ్ల పిల్లవాడు స్వారోచిషమనుసంభవం చదవటం అంటే అది అద్భుతం కాక మరేమిటి?

కాలం చాలా శక్తివంతమైంది. అది మనిషిని, రకరకాలుగా ప్రలోభపెట్టటానికి ప్రయత్నిస్తుంది. ముఖ్యంగా 'నన్ను నేను కంట్రోలు చేసుకోగలనని అనుకునేవాళ్లను' దేనికీ లొంగనివాడే ధీరోదాత్తుడు. కానీ వాడు మాత్రం లొంగిపోయాడు. రాను రాను వాడి ఆలోచనలు బలహీనమవడం ప్రారంభించాయి. అప్పుడప్పుడే ఒక వ్యక్తిత్వం అలవడుతున్నవాడికి కాలేజీలో చేరాక-అమ్మాయిల అందచందాలు, సినిమా పోస్టర్లు ఒకవైపు, చదువు జీవితం మరోవైపు- ఎటువైపు మొగ్గాలో సందిగ్ధంలో పడ్డాడు. చివరికి మొదటిదానివైపు ఆకర్షితుడయ్యాడు. ఫలితంగా ఇంటర్మీడియట్ అటకెక్కింది.

వాడు చేసేదంతా తప్పని నాకు తెలుస్తూనే ఉంది. కానీ, విశ్లేషించి చెప్పగలిగేటంత నైపుణ్యం నాకు అప్పట్లో లేదు. అందుకే చూస్తూ పూరకుండిపోయాను తప్ప ఏమీ చేయలేకపోయాను.

ఎప్పుడయితే-అపజయం ఎదురయిందో అప్పుడు వాడిలోని గర్వం తగ్గింది. తన ఆలోచనలను విశ్లేషించుకునే తత్వం అలవాటయ్యింది. ఏది కరెక్టో ఏది కాదో నిజాయితీగా ఆలోచించగలిగే సందర్భం వచ్చింది.

ఆ రోజుల్లోనే-వాడికి ఓ పుస్తకం చదవడం తటస్థించింది. మానవ జీవితాన్ని, ప్రేరణ కలిగించే వ్యక్తిత్వాన్ని ఎంత బలంగా నిర్మించుకోవచ్చో, దేవుడిచ్చిన జీవితాన్ని సక్రమంగా మలచుకోవాలో వాడికి తెలియజెప్పిన ఆ పుస్తకం - 'ది కంప్లీట్ వర్క్స్ ఆఫ్ స్వామి వివేకానంద'

బేసిక్‌గా వాడు తెలివికలవాడు. ముఖ్యంగా 'అపజయం' ఎలా ఉంటుందో రుచి చూసినవాడు. ఇన్ని సంఘర్షణలు అనుభవాలతో వాడి వ్యక్తిత్వం ఎదగడం మొదలుపెట్టింది. ఎక్కువగా ఆలోచించేవాడు. ఆ ఆలోచనలతోనే-వాడు 'రచయిత' అయ్యాడు.

అప్పటివరకూ కుటుంబ కథలతో, డిటెక్టివ్ కథాంశాలతో రాజ్యమేలుతున్న సాహిత్య ప్రపంచంలో వాడు రాసిన నవల పాఠకులను కొత్తగా ఆలోచించేలా చేసింది. 'అటాచ్‌మెంట్ విత్ డిటాచ్‌మెంట్' అన్న కాన్సెప్ట్‌తో ఎక్కువ భాగం మానసిక విశ్లేషణతో అన్నిటిలో ఉంటూనే అన్నిటికీ ఎలా దూరంగా ఉండాలో చెబుతూ చివరికి వేదాంత స్థితికి చేరుకునే కథాంశంతో ముఖ్యంగా-ముగింపు పాఠకుల్ని ఒక విధమైన ట్రాన్స్‌లోకి పంపింది.

చాలామంది దాన్ని యిష్టంగా చదివారు. కొంతమంది విమర్శించారు. ఇంకొంతమంది సాహిత్యం పాడైపోతుందనీ వేదాంతాన్ని కూడా కమర్షియ లైజ్ చేస్తున్నారనీ గగ్గోలు పెట్టారు. ఏలాగయితేనేం-దాదాపు నాలుగైదు నవలలు రాస్తే వచ్చే గుర్తింపు వాడికి ఆ ఒక్క నవలతోనే వచ్చింది. అపుడు తెలిసింది వాడికి 'కీర్తి' రుచి. రాజకీయ నాయకులుగానీ, సినిమా హీరోలుగానీ, రచయితలుగానీ కొంతకాలానికి 'ఫేడవుట్' అవుతారు. కానీ ఒకసారి కీర్తి రుచి మరిగాక తమ వెనకబాటుతనాన్ని అంత తొందరగా వాళ్లు ఒప్పుకోరు.

కీర్తిప్రతిష్టలు కూడా వాడికి రాను రానూ 'కిక్' ఇవ్వటం మానేశాయి. కేవలం పేరే ఏం చేసుకుంటాం. దాంతోపాటూ డబ్బు కూడా సంపాదించుకుందాం అనుకున్నాడు. డబ్బు యావలో పడి నైతిక విలువల్ని వదిలేశాడు. క్షణం తీరిక లేకుండా బిజీ జీవితానికి అలవాటు పడ్డాడు.

ఓ రోజు సాయంకాలం తన గదిలో కూర్చుని ఉన్నాడు. వాడు ఒంటరిగా ఉండటం చూసి నేను హెచ్చరించా ''నువ్వు పూర్తిగా మారిపోయావ్. ఇంతకుముందు నీకూ, ఇప్పటి నీకూ సంబంధమే లేదు. ఒకప్పుడు నువు విలువలకి విలువ యిచ్చేవాడివి. ఇపుడు డబ్బుకిస్తున్నావు. అందుకే-బిజీ జీవితం గడుపుతున్నా, కావలసినంత డబ్బున్నా నువ్వు ఆనందంగా గడపలేకపోతున్నావు. ఎందుకూ పనికిరాని 'ఎగోయిస్టిక్' భావాల్ని వదిలిపెట్టు. నువు సుఖంగా ఉంటావ్. నేనూ సంతోషంగా ఉంటాను''

వాడు విరగబడి నవ్వి అన్నాడు.

''సంపాదించడం చేతకాని ప్రతివాడూ చెప్పే మాటలే నువ్వూ చెబుతున్నావ్. ఇంత విశాలమయిన ప్రపంచంలో ఎవడయినా సరే 'ప్రస్తుతం నేను డబ్బు సంపాదిస్తున్న మార్గం సరైంది కాదు. అందుకే అలా సంపాయించడం మానేస్తున్నాను' అన్నవాడిని కనీసం ఒక్కణ్ణి చూపించు. నేనూ మారిపోతా. అయినా ఎందుకు మారాలని? ఒకప్పుడు నాకు ఈ కార్లూ, బంగ్లాలూ లేవు. అభిమానులు లేరు. ఇప్పుడవన్నీ ఉన్నాయి. వీటన్నిటినీ నేనే స్వయంగా సంపాదించుకున్నానంటే నామీద నాకే ఎనలేని ఆత్మవిశ్వాసం. అయినా నేనేమంత చట్ట విరుద్ధమైన పనులు చేస్తున్నానని?''

''నిజమే. నువ్వు న్యాయబద్ధంగానే సంపాదిస్తున్నావు. నువ్వు రాస్తున్నది చదివి పదిమంది ప్రేరణ పొందాలే కానీ చెడు మార్గంలో పడకూడదు. అనవసరమైన భ్రాంతులకు వాళ్లను లొంగదీయొద్దు. వీటన్నిటికంటే ముఖ్యమైంది. మనశ్శాంతి. నిజం చెప్పు. ప్రతిక్షణం నువ్వు సంతృప్తిగా, మనశ్శాంతిగా ఉన్నావా? ముఖ్యంగా నువ్వు చేస్తున్న రచనల పట్ల, వాటి వల్ల నీకు వస్తున్న పాపులారిటీ పట్ల!''

3


తనలోకి తను తరచి చూసుకుని తప్పును ఒప్పుకోవాలంటే మనిషికి చాలా గుండె నిబ్బరం, ధైర్యం కావాలి.

''నైతిక విలువల గురించి నువ్వు నాకు చెప్పక్కర్లేదు. డబ్బున్నవాళ్లు సుఖంగా లేరనుకోవటం వట్టి భ్రమ మాత్రమే''

''నేను చెప్పేది ఆ విషయం గురించి కాదు'' నా మాట పూర్తికాకుండానే వాడన్నాడు.

''నువ్వు నోర్మూసుకో. ఇంకెపుడూ యిలాటి సలహాలివ్వకు''

నేనూరకుండిపోయాను. అప్పుడే కాదు ఇంకెప్పుడూ కూడా. నా మాట వినకపోతే పరిణామాలు ఎలా ఉంటాయో తెలియచెప్పటానికి సమయం కోసం ఎదురుచూస్తున్నాను.



★ ★ ★

దాదాపు పదిహేను, ఇరవై సంవత్సరాలు గడిచాయి.

ఒక వస్తువుకి డిమాండ్‌గానీ, ఒక రచయితకయినా, నటుడికయినా పాపులారిటీగానీ, ఒక కంపెనీ 'షేరు' విలువగానీ ఒక స్టేజీ వరకూ పెరుగుతూ ఉంటుంది. అదే పీక్ స్టేజి. అక్కడికెళ్లిన తర్వాత రకరకాల కారణాల వల్ల వాటి డిమాండ్ పడిపోతుంది. ఫలితంగా తిరిగి అది తిరోగమిస్తుంది.

అయితే- పై థియరీ తప్పని వాడి పాపులారిటీ చూస్తే తెలుస్తుంది. ఇన్ని సంవత్సరాల్లో వాడి నైపుణ్యం ఇంకా పెరిగింది. పేరు ప్రఖ్యాతులు కూడా పెరిగాయి. అయితే ఇన్నేళ్లు గడిచాక కూడా వాడిలో మానసికంగా పెద్ద మార్పు రాలేదు. ఇంకా చెప్పాలంటే పాపులారిటీలో ఉన్న మైకం వాణ్ణి పూర్తిగా కమ్మేసింది. డబ్బు, అదిచ్చే సుఖాలూ, సమాజంలో గుర్తింపూ..ఇవేవీ వాణ్ణి వెనక్కి తిరిగి చూసుకోనివ్వలేదు.

మనిషి తన గురించి తను ఆలోచించుకునే సందర్భం కనీసం ఒకటన్నా రావాలి. అలా రాలేదంటే ఆ మనిషి జీవితంలో ఎదుగుదల 'సున్నా'గానే ఉంటుంది.

ఓరోజు సాయంకాలం.

వాడు పర్సనల్ రూంలో కూర్చుని రాసుకుంటున్నాడు. పెన్ను కదిలే శబ్దం తప్ప అంతా నిశ్శబ్దంగానే ఉంది. ఎవరో తలుపు తట్టిన చప్పుడికి రాసుకుంటున్న వాడల్లా తలెత్తి గ్లాసు తలుపుల్లోంచి చూశాడు.

ఎవరో అమ్మాయి ఇరవై, ఇరవై అయిదు లోపు ఉంటుంది వయసు. క్షణంసేపు ఆలోచించాడు. ఎక్కడా చూసిన గుర్తు లేదు. లోపలికి రమ్మన్నట్టు సంజ్ఞ చేశాడు. వచ్చి ఎదురుగా కుర్చీలో కూర్చుంది. 'తన అభిమాని' అయ్యుంటుందని అనుకున్నాడు.

రాస్తున్నదాన్నల్లా పక్కన పెట్టి ''ఏమిటి? ఎవరు నువ్వు? ఎందుకొచ్చావ్?'' అడిగాడు.

సడ్డా సుబ్బారెడ్డి

సమాధానం లేదు.

''నా అభిమానివా?''

సమాధానం రాలేదు. ఆశ్చర్యపడటం వాడి వంతయ్యింది. తన దగ్గరకొచ్చిన ఎవరైనా 'వాళ్లెంతగా తన నవల్సు చదువుతారో, ఎంతగా అభిమానిస్తున్నారో' ఏకరువు పెడతారు. అలాంటిది ఈ అమ్మాయి మౌనంగా ఉంది. అడిగిన వాటికి కూడా సమాధానం చెప్పడం లేదు.

''నువ్వెరో, ఎందుకొచ్చావో నువు చెబితేనే కదా తెల్సేది?''

ఆ అమ్మాయంది- ''మీరు నాకో సహాయం చేయగలరా సర్?'' వాడి సమాధానం కోసం ఎదురుచూడకుండా చెప్పుకుపోతోంది.

''నేను ఒకబ్బాయిని ప్రేమించా. అతడు కూడా. మా పెద్దలు మా వివాహానికి ఒప్పుకోవడం లేదు. ఎక్కడికయినా వెళ్లిపోదామనుకుంటే ఆర్థికంగా ఇద్దరమూ నిలదొక్కుకోలేని స్థితి. నా మాట వినకుండా మా యింట్లో నాకు పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. దీన్నించి ఎలా తప్పించుకోవాలో ఆలోచించి చివరికి మీ దగ్గరకొచ్చా. ఎన్నో నవలల్లో ఎన్నో ప్రేమికుల పాత్రలకు ఒక చక్కని ముగింపునిచ్చారు. నాకు ఏదయినా హెల్ప్ చేయండి సార్'' ప్రాధేయపడుతున్నట్టు అడిగింది.

కొంచెంసేపు వాడికి ఏమీ అర్థం కాలేదు. తర్వాత అన్నాడు.

''చూడమ్మా మేం రచయితలం. మేం రాసేది కథలు. అంటే కల్పితమైనవి. నిజ జీవితంలో అలానే జరగొచ్చు. జరక్కపోనూవచ్చు. మేం రాస్తున్న వాటిని పాఠకులు చదివి ఆదరిస్తున్నారు. అదే మాకు తిండిపెడుతుంది. కడుపుకోసం మేం అలా రాస్తున్నాం. అంతే తప్ప నిజ జీవితంలో మేం అలానే ప్రవర్తిస్తామని అనుకుంటే ఎలా?''

''కానీ ఒక సమస్య నాకొచ్చింది దాన్ని మీకున్న అనుభవంతో ఎలా పరిష్కరించగలరో చెప్పమంటున్నాను''

''కథలు, నవలలూ చదివి అలానే చేయాలను

కోవడం మూర్ఖత్వం. మనిషి తనలో లేనిదాన్ని చదవటం ద్వారానో, చూడటం ద్వారానో అందులో తనని ఐడెంటిఫై చేసుకుంటాడు. మేం రాసేవన్నీ కథలే. అందమైన కలలే. కలల్ని నిజం చేసుకోవాలనుకోవడం మూర్ఖత్వం- ముఖ్యంగా ప్రేమ విషయంలో''

ఆ అమ్మాయి సమాధానం చెప్పలేదు.

''ఇరవయ్యేళ్ల వయసులో కలిగేది ఇన్‌ఫాచ్యుయేషన్. దాన్నే మీరు ప్రేమగా ప్రాజెక్ట్ చేసుకుంటున్నారు. ప్రేమ వేరు. ఆకర్షణ వేరు. స్నేహం వేరు. ఈ మూడూ ఏ పాయింట్ దగ్గర విడిపోతాయో చెప్పడం కష్టం. ఇంకా చెప్పాలంటే ప్రేమలాంటివన్నీ కేవలం ట్రాష్. ఈ వయసులో నీకు నమ్మాలనిపించదు. ఎదుటిమనిషి సరిగ్గా అర్థం చేసుకోలేదనిపిస్తుంది. కానీ కాలం గడిచేకొద్దీ నీకే అర్థమవుతుంది. జీవితంలో సాధించాల్సినవి చాలా ఉన్నాయి. వాటికోసం ప్రయత్నించు. ప్రేమకోసం వాటిని వదిలేసెయ్యొద్దు''

''మీరు నా సమస్యను సరిగ్గా అర్థం చేసుకోవట్లేదేమో నన్పిస్తుంది. మేం ప్రేమించుకుంటున్నాం. ఒకర్ని వదిలి మరొకరం బ్రతకలేము. మీరేదయినా మార్గం చెబుతారేమోనని మీ దగ్గరకు వచ్చాను. ఎన్నో గొప్ప గొప్ప నవల్లో రాసి స్త్రీని పువ్వులకంటే సున్నితంగా చూపే మీ రచనలు, వాళ్ల ప్రేమను సాధించుకునే ధీరోదాత్తత... ఇవన్నీ మీ పట్ల విపరీతమైన అభిమానాన్ని కలగజేసాయి. అసలు జీవితంలో కనీసం ఒక్కసారయినా ప్రేమించకపోతే అటువంటి జీవితమే వృధా అన్నట్లుగా ఉండే మీ రచనలు. ఇంకా నిజం చెప్పాలంటే మీ రచనలు చదివాకే నాకూ ప్రేమించాలనే ఆలోచన కలిగింది''

''ముందే చెప్పాగదా. మేం కడుపుకోసం అలా కల్పితాలు రాస్తుంటాం. అందమైన కలల్లో పాఠకుల్ని విహరింపజేస్తాం. అవన్నీ నిజం కాదని మీకు చెబితే అర్థం గాదు''

''మీరెన్నయినా చెప్పండి. అతడు లేకపోతే నేను బ్రతకలేను. ఒకవేళ మేం ఇద్దరమూ కలిసి జీవించలేమన్న సందేహమే వస్తే ఇద్దరం కలిసి చనిపోతాం తప్ప రాజీపడే ప్రసక్తే లేదు''

## లారా తెలివి

**కొన్ని సినిమాలు అనుకోని అదృష్టాన్ని తెచ్చిపెడతాయి. అందాజ్ సినిమా తర్వాత లారాదత్తా స్టయిలే మారిపోయింది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న 'ముంబై సే ఆయా మేరా దోస్త్'. ఈ చిత్రంలో ఆమె ఓ గిరిజన యువతిగా సహజసిద్ధమైన నటనా కౌశలాన్ని ప్రదర్శించనుంది. ఈమె ఆహార్యం, హావభావాలు, కళ్ళు ఈ పాత్రకి చక్కగా సరిపోతాయని భావించిన దర్శకుడు ఆమెకి ఈ సినిమాలో నటించే ఛాన్స్ ఇచ్చాడు. 'ఈ సినిమాలో ఆమెనటన డిఫరెంట్‌గా సరిపోతుందని భావించి ఈ పాత్రకి ఆమెని ఎంపికచేశాను' అంటున్నాడు దర్శకుడు అపూర్వ లఖియా. ఏమైనా లారా తెలివైన అమ్మాయే!**



''కానీ ఆత్మహత్య పిరికివాళ్ల లక్షణం'' అన్నాడు వాడు.

ఆ అమ్మాయి కుర్చీలోంచి లేచింది- బయలుదేరడానికన్నట్లుగా.

తలుపు దగ్గరకు వచ్చి ఒక చేత్తో డోర్ ఓపెన్ చేసి ''అలా అయితే మేము పిరికివాళ్లమే'' అంది.

వాడేదో చెప్పబోయేంతలోనే వెళ్లిపోయింది.

ఆ విషయం గురించే వాడు చాలాసేపు ఆలోచించాడు. ఏం చేయాలో తోచలేదు. అరిచే కుక్క కరవదనే సామెత గుర్తొచ్చింది. 'మేము చస్తాం..చస్తాం..అనే వాళ్లెవరు చావరు' అనుకున్నాడు. కాసేపటికి దాని గురించి పూర్తిగా మర్చిపోయి తన పనిలో నిమగ్నమయ్యాడు.

★ ★ ★

ఉదయాన్నే పేపరు చదివిన వాడికి దిగ్భ్రాంతి కలిగింది.

తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. మళ్లీ చదివాడు 'ప్రేమికుల ఆత్మహత్య' అన్న హెడ్డింగ్. కింద వివరంగా ఉంది. 'పెద్దలు ఒప్పుకోలేదనీ, ఇక ఏ విధంగానూ తమ ప్రేమను నిలుపుకోలేమని తెలిసి అలా ఆత్మహత్యకు పాల్పడుతున్నామని, తమ చావుకు ఎవరూ బాధ్యులు కారనీ' దాని సారాంశం!

పేపరు మూసేశాడు. కానీ వాడికి బాధగా ఉంది. ఎవరితోనూ చెప్పుకోలేని సమస్యలా అన్పించింది. 'ఇంకొంచెం జాగ్రత్తగా వ్యవహరించి ఉంటే ఇంత దారుణం జరిగి ఉండేది కాదు కదా- దీనికి బాధ్యుణ్ణి నేనే' అనుకున్నాడు కాసేపు.

తప్పును ఒప్పుకోవడమంటే ప్రాయశ్చిత్తపడటమే. కానీ కొన్నిసార్లు దీనికీ మినహాయింపులున్నాయి.

తప్పు తనదేనని ఒప్పుకున్నా వాడు ఆనందంగా ఉండలేకపోతున్నాడు.

ఆరోజు రాత్రి ఒంటరిగా కూర్చుని ఉన్నాడు. అప్పుడు గుర్తొచ్చింది వాడికి ఆ అమ్మాయి అన్నమాట.

''జీవితంలో ఒక్కసారయినా ప్రేమించకపోతే ఆ జీవితమే వృధా అన్నట్లుండే మీ రచనలు. ఇంకా నిజం చెప్పాలంటే మీ రచనలు చదివాకే నాకిలా ప్రేమించాలనే కోరిక కలిగింది''

ఎక్కడో మనసు పొరల్లో అట్టడుగు భాగాన వాస్తవానికి సంబంధించిన చలనం మొదలయ్యింది. నిజాయితీగా ఆలోచించడం ప్రారంభించాడు.

ఎన్నుకున్నాను? చివరికి ఏం జరుగుతుంది? ఒక్కొక్క రాయి పేర్చుకుంటూ అందమైన సౌధం నిర్మిద్దామనుకున్నానే. ఆ సౌధం ఇంత పెళుసుదా? ఎవడో ఒకడు బాగుపడి ఉండొచ్చు. మరి చెడిపోయే వాళ్ల మాటేమిటి? ఇతరులను చెడుగా తీర్చిదిద్దే హక్కు తనకెవరిచ్చారు? పదహారేళ్ళు వచ్చేటప్పటికి ఎవరో ఒకర్ని ప్రేమించకపోతే జీవితమే వృథా అన్నట్లుండే సినిమాలు, నవలలూ..మనిషిని ఎంత వరకూ నిజాయితీగా ఆలోచింపజేస్తాయి?

వాడిలో ఆత్మ పరిశీలన మొదలైంది.

మనిషి తన గురించి తను ఆలోచించుకునే సందర్భం కనీసం ఒకటన్నా రావాలి. అలా రాలేదంటే ఆ మనిషి జీవితంలో ఎదుగుదల లేదన్న మాట.

అలాటి సందర్భం వాడిలో ఇప్పుడు ప్రారంభమైంది. అయితే అదెక్కడివరకూ వెళుతుందో వాళ్ల మానసిక స్థాయిని బట్టి ఉంటుంది.

ఆరోజు రాత్రి వాడు ఆలోచించాడు.

'అసలు నేనెక్కడ పుట్టాను? ఎటువంటి పరిస్థితుల్లో పెరిగాను? రచయితగా కెరీర్ ప్రారంభించినప్పుడు నా ఆశయాలేమిటి? చివరికి జరుగుతున్నదేమిటి? ఒకప్పుడు నాలోవున్న భావుకుడు ఏమయ్యాడు? ఆరుబయట వెన్నెల్లో పడుకుని ఆకాశం కేసి చూస్తూ నక్షత్రాల్ని లెక్కపెట్టిన రోజులు, పండుగరోజు కొత్తబట్టలు కట్టుకుంటే వారం రోజులు ఊరంతా గర్వంగా తిరిగిన రోజులు..ఏమైపోయాయి? అసలు నేనింత మెటీరియలిస్టిక్‌గా ఎందుకు తయారయ్యాను?

మనిషి తనకు ఏది లేదో దాన్ని సాధించాలనుకుంటాడు. బహుశా పేదరికంలో పుట్టిన నేను డబ్బు సంపాదనలో పడి, యిలా తయారయ్యానా? అసలు ఒకప్పటికి ఆలోచనలకీ, అభిప్రాయాలకీ, ఆశయాలకీ ఇప్పటికీ ఎందుకు పొంతన కుదరటం లేదు?''

దాదాపు పదిరోజులు ఇలాంటి ఆలోచనలతోనే గడిపాడు.

పదకొండోరోజు ఒక నిర్ణయానికొచ్చాడు. పత్రికలవాళ్లని పిలిచి వాడి నిర్ణయం ప్రకటించాడు 'రచయితగా అస్త్రసన్యాసం చేస్తున్నాను' అని.

ఊహించని ఈ నిర్ణయానికి వాళ్లు ఉలిక్కిపడ్డారు. ఫామ్‌లో ఉన్న ఒక రచయిత ఇలా ప్రకటించడం పట్ల రకరకాల ఊహాగానాలు వెలువడ్డాయి కొన్ని రోజులు. తర్వాత అంతా మామూలే.

★ ★ ★

వాడు తీసుకున్న ఈ నిర్ణయం నాకు చాలా సంతోషం కలగజేసింది. ఎప్పుడయితే వాడికి కోరిక నశించిందో అప్పుడు ఆలోచన తగ్గింది. తిరిగీ వాడు పుస్తకాలు చదవటం మొదలుపెట్టాడు.

పాతికేళ్ల క్రితం అస్తవ్యస్తంగా ఉన్న వాడి జీవితాన్ని ఓ పుస్తకం మార్చివేసింది. ఒక లక్ష్యాన్ని వాడిలో నింపి ప్రగతి వైపు దూసుకెళ్లేట్టు చేసింది. అయితే-ఆశకీ లక్ష్యానికీ తేడా తెలుసుకోలేకపోయాడు. నేను ఒక పక్క హెచ్చరిస్తున్నా నా మాటలు పెడచెవిన పెట్టాడు. చివరకు నిర్వీర్యమైపోయాడు. తనంటే ఏమిటో తెలుసుకోవడానికి వాడికి ఇన్ని సంవత్సరాలు పట్టింది.

వాడి జీవితాన్నంతా విశ్లేషించుకున్నాక వాడికి ఓ సత్యం అర్థమైంది.

'కొండలు, కోనలు, పర్వతపు సానువులు దాటి శరవేగంగా పరిగెత్తే వాగుల్నీ, నదుల్నీ, సెలయేళ్లనీ చూసి సముద్రుడు నవ్వుకుంటాడట. అంతగా ఉరుకులు పరుగుల మీద వచ్చి చివరికి మీరు సాధించేదేమిటి? నాలో కలిసిపోయి- మీ అసలు ఉనికినే కోల్పోవడం తప్ప' అని. మనిషిని చూసి దేవుడూ అలానే అనుకుంటాడట'

వాడికిప్పుడు ఏ కోరికలూ లేవు. అలా అని వైరాగ్యస్థితి కాదు. వేదాంత స్థితి. 'గీత'లో భగవానుడు చెప్పిందీ, గయలో బుద్ధుడు చెప్పిందీ అదే. అన్నిటిలో ఉంటూనే అన్నిటికీ దూరంగా ఎలా ఉండాలో 'ఎటాచ్‌మెంట్ విత్ డిటాచ్‌మెంట్' అన్న కథాంశంతో వాడు రాసిన తొలి నవల సారాంశం కూడా అదే.

దాన్ని వాడు సాధించాడు.

★ ★ ★

నగర వాతావరణానికి దూరంగా..ఓ చిన్న పల్లెటూరు..అక్కడ ప్రకృతంతా రమణీయమే. పచ్చపచ్చని పొలాలు..పక్కనే పారే సెలయేరు. ఇంకా అక్కడ గొడ్లచావిళ్లు..గోధూళి ఎరుపు..పసిపాపల చిరునవ్వులు..పండగొస్తే ఊరంతా సంబరమే. అక్కడి మనుషుల మనసుల్లో గదులుండవు..స్వచ్ఛమైన స్నేహం ఉంటుంది. కల్మషం ఉండదు. కనికరం ఉంటుంది.

అక్కడ ఇంకా కోతికొమ్మచ్చులుంటాయ్. వాగులో ఈత కొట్టడాలూ..గోళీకాయలూ..ఇంకా ఎన్నో..అక్కడికి ఎవరొచ్చినా స్వచ్ఛమైన గాలినే పీల్చుకోవచ్చు.

అలాంటిచోట...ఓ చిన్న పొదరిల్లూ..వాడు, వాడి భార్య, ఇద్దరు పిల్లలు...నాగరికతకు దూరంగా సంస్కృతికి దగ్గరగా..పల్లెటూరి జనాల మధ్య.

తిరిగీ వాడు తన మూలాలకి వెళ్లిపోయాడు.

వాణ్ణి చూసి నాకు గర్వంగా అన్పించింది.

నా మాట వినకపోతే కలిగే పరిణామాలు ఎలా ఉంటాయో ప్రాక్టికల్‌గా వాడు అనుభవించి అర్థం చేసుకున్నాక నాకు సంతోషంగా అన్పించింది.

ఇంతకీ..నేనెవరో మీకు తెలుసా?

నేను...నేను..నేను...

వాడి మనసును!

## ఐస్ ఆనందం

**'భూత్' చిత్రం తర్వాత రాంగోపాల్‌వర్మ ఏ చిత్రం తీస్తున్నారు? ఎప్పుడు విడుదలవుతుంది? అన్న కుతూహలం అందరిలోనూ కలుగుతోంది. వివేక్ ఓబెరాయ్, ఐశ్వర్యారాయ్‌లు జంటగా నటిస్తున్న 'దర్నా మనా హై' ఇప్పుడు లండన్‌లో షూటింగ్ జరుపుకుంటోంది. ఈ చిత్రం రాంగోపాల్ వర్మ చేతుల మీదుగా రూపుదిద్దుకుంటోంది. అయితే ఈ చిత్రం గురించిన విశేషాల్ని అంతగా పత్రికలకి విడుదల చేయడంలేదు. ఈ చిత్రం షూటింగ్ సందర్భంగా పాత జ్ఞాపకాల్ని నెమరువేసుకోకుండా చాలా హ్యాపీగా షూటింగ్‌లో పాల్గొంటున్న ఐస్‌ని చూసి వివేక్ చాలా సంబరపడిపోతున్నాడట. భూత్ తరహాలో ఈ చిత్రం కూడా హిట్ అయితే ఐశ్వర్యారాయ్ ఆనందానికి అంతే ఉండదంటున్నారు.**

